# అంగన్‌వాడీల్లో కొరవడిన సౌకర్యాలు

- మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్న పిల్లలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

**గూడూరు :** మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. నామ మాత్రంగా పిల్లలకు, గర్భిణీ, బాలింతలకు పౌష్టి కాహారం అందిస్తూ కేంద్రాలను కొనసాగిస్తున్నారు. కానీ చిన్నారులకు అవసరమైన మరుగుదొడ్లు లేక పిల్లలు ఆయాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని గూడూరు-1 అంగన్‌వాడీ కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్డి నిర్మాణం ఉపయోగం లేకుండా పోయింది. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.


అసంపూర్తిగా ఉన్న టాయిలెట్ నిర్మాణం, పనిచేయని చేతిపంపు

### అసంపూర్తిగా మరుగుదొడ్డి నిర్మాణం

గూడూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల కోసం నిర్మాణం చేపట్టిన మరుగుదొడ్డి నిర్మాణం అసంపూర్తిగా నిలిచింది. దీంతో పిల్లలు బాత్‌రూం, టాయిలెట్‌కు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలను బయటికి తీసుకెళ్లాలంటే భయమేస్తుంది. ఎటు నుంచి ఏ వాహనం వస్తుందోని భయమేస్తుంది.

– ఊర్మిల, అంగన్‌వాడీ కేంద్రం, ఆయా

# సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని కొత్తగూడ, దంతాలపల్లి ఎంఈఓలు గుమ్మడి లక్ష్మీనారాయణ, శ్రీదేవి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ టీచర్లు కొనియాడారు. మహబూబాబాద్, కొత్తగూడ, డోర్నకల్, గూడూరు, దంతాలపల్లి, బయ్యారం, కురవి, నెల్లికుదురు మండలాల్లోని పాఠశాలల్లో విద్యా ర్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్టులు నిర్వహించారు. పరీక్షలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ప్రతిభ గల విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


కొత్తగూడ : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

## విరాళం అందజేత

**చిన్నగూడూరు :** మండలంలోని గంగమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం కోసం మండల కేంద్రానికి చెందిన దాత డాక్టర్ రాంపెల్లి విజయ్ కుమార్ రూ.50 వేలు విరాళంగా యాదవ సంఘం కమిటీ నిర్వాహకులకు అందజేశారు. నర్సయ్య, మల్లయ్య, వెంకన్న, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

## స్వయంపాలన దినోత్సవం

**కేసముద్రం:** కేసముద్రం మున్సిపాలిటి పరిధిలోని కృషి గాయత్రి విద్యాలయంలో స్వయంపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

## బీసీలకు బడ్జెట్ కేటాయించాలి



**నెహ్రూసెంటర్ :** బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారే తప్ప వారి అభివృద్ధికి తోడ్పాటునందించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, నలమాస సాయి, సోమన్న, పురుషోత్తం, సాయికిరణ్, మల్లేష్, శంతన్, హన్మంతు, బాలరాజు, పాల్గొన్నారు.

## దోపిడీని అరికట్టాలి

**నెహ్రూసెంటర్ :** ప్రైవేట్ ఆస్పత్రుల్లోని వైద్య దోపిడీని అరికట్టి, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కార్యదర్శి కందాల రంగయ్య అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డీఐఓ లక్ష్మీనారాయణకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దారావత్ సంతోష్, ఎర్రగొండ ఉమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

**గార్ల:** ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి రానున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర నాయకుడు జడ సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామసభల్లో తీసుకున్న దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేయకుండా పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఇర్రి రవి, తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### అద్దె గదుల్లో భోజనాల లొల్లి

**కురవి:** మండల కేంద్రంలోని ఆలయం పక్కన అద్దె గదుల్లో ఓ వివాహ వేడుకలకు సంబంధించి భోజనాల చేసే సమయంలో శుక్రవారం పెద్ద ఎత్తున కొట్లాట జరిగింది. డోర్నకల్ మండలం వెన్నారం శివారు రాము తండాకు చెందిన అమ్మాయికి కేసముద్రం మండలం రేకుల తండాకు చెందిన అబ్బాయికి వివాహం జరిగింది. భోజనాల వద్ద ఇరువురి బంధువుల మధ్య జరిగిన లొల్లి కాస్తా పెద్దదిగా మారి రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు కొట్లాడుకున్నారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెల్లాచెదురు చేసేందుకు యత్నించారు. దీంతో పెళ్లికి వచ్చిన బంధువుల్లోని యువకులు ఏఎస్సై వెంకన్నతో పాటు ఇతర కానిస్టేబుల్స్‌పై తిరగబడ్డారు. దీంతో పోలీసులపై తిరగబడడంతో లాఠీలకు పని చెప్పారు. పోలీసులపై తిరగబడిన నలుగురిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయమై ఏఎస్సై వెంకన్నను వివరణ కోరగా రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు కొట్టుకుంటుంటే ఆపేందుకు వెళ్లిన తమపై తిరగబడ్డారని తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### నాటుసారా, రెండు ద్విచక్రవాహనాలు సీజ్

**గూడూరు :** స్థానిక ఎక్సైజ్ శాఖ సీఐ ఎన్.భిక్షపతి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక రూట్ వాచ్ కార్యక్రమంలో 28 లీటర్ల నాటుసారా, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కేసముద్రం మండలంలోని మేఘ్యా తండా సమీపంలో రూట్ వాచ్ చేపట్టామని తెలిపారు. ఆ సమయంలో ఓ స్కూటీపై వచ్చిన వ్యక్తి వద్ద 8 లీటర్ల నాటుసారా లభించింది. ఆ తరువాత మండలంలోని బొల్లెపల్లి సమీపంలో ఓ వ్యక్తి పల్సర్ వాహనంపై రాగా అతని వద్ద 20 లీటర్ల నాటు సారా లభించిందన్నారు. వెంటనే ఆ రెండు వాహనాలతో పాటు ఇద్దరిని గూ డూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయం తరలించి, ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**గూడూరు:** రెండు ట్రాక్టర్లలో అక్రమ ఇసుక తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై బి. గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తీగలవేణికి చెందిన పఠాన్ యాకూబ్ అలీ ట్రాక్టర్‌తో పాటు మరో ట్రాక్టర్ గురువారం రాత్రి ఇసుక తరలిస్తుండగా మాటు వేసి పట్టుకున్నామని తెలిపారు. ఒక ట్రాక్టర్ సీజ్ చేసి, యజమానిపై కేసు నమోదు చేశామని, మరో ట్రాక్టర్‌ను ఆర్డీఏ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

### ఆటోను ఢీకొన్న కారు.. ముగ్గురికి తీవ్రగాయాలు

**తొర్రూరు రూరల్ :** మండలంలోని ఫత్తేపురం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను కారు ఢీకొట్టిన సంఘటనలో శుక్రవారం ఉదయం ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై తొర్రూరు నుంచి మాటేడు వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఖమ్మం నుంచి వరంగల్ వైపు వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న సంగె మౌనిక, తాళ్ల నర్సయ్య, తాళ్ల సందీప్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### విద్యార్థికి గాయాలు

**దంతాలపల్లి :** స్థానిక మహాత్మజ్యోతిరావు పూలే గురుకులంలో ఐదో తరగతి చదువుతున్న గండి విక్రమాదిత్యకు శుక్రవారం తలకు గాయమైంది. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. విక్రమాదిత్య పాఠశాలలో అల్లరి చేస్తున్న క్రమంలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థిని కోపగించుకున్నాడు. నన్ను ఎక్కడ కొడుతాడోనని భయపడిన విద్యార్థి తప్పించుకునే క్రమంలో గోడకు తగలడంతో తలకు గాయమైంది. గమనించిన ఉపాధ్యాయులు విద్యార్థి తండ్రికి విషయం తెలిపారు. అక్కడికి చేరుకున్న తండ్రి, ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు.

## సంక్షిప్త సమాచారం

### ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

**తొర్రూరు :** ఐక్యతతోనే బీసీల సమస్యలు పరి ష్కారమవుతాయని ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి అలువాల సోమయ్య అన్నారు. ఈ నెల 2న వరంగల్‌లో జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి సభ పోస్టర్లను శుక్రవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు ఆవిష్కరించారు.

### దారి సమస్య పరిష్కరించాలని ఆందోళన

**మరిపెడ :** మున్సిపాలిటీ కేంద్రంలో బానోతు దామతన ఇంటి వద్ద ఉన్న దారి సమస్య పరిష్కరించడంలో ఎవరు సహకరించడం లేదని, స్థానికులు ఏడుగురు వ్యక్తులు నా సమస్యకు అడ్డు పడుతున్నారని వాపోయాడు.మండల పరిషత్ ఆవరణలోని వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. సమస్యకు అడ్డుపడుతున్న వ్యక్తుల నుంచి తనకు ప్రాణభయం ఉందని రోడ్డు సదరు వ్యక్తుల ఫొటోలతో ప్రదర్శనగా వెళ్లి ఓ చోట ఉంచి అట్టి వ్య క్తుల ఫొటోలకు చెప్పుల దండ వేసి ఆందోళన వ్య క్తం చేశాడు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యను పరిష్కరించాలని బాధితుడు డిమాండ్ చేశాడు.

### విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

**మహబూబాబాద్ అర్బన్:** డిగ్రీ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి అధ్యాపకులు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. లక్ష్మణ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యూత్ ఫర్ సోషల్ ఇంఫాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ నిర్వహించారు.

### తప్పిపోయి పీఎస్‌కు చేరిన బాలుడు

**గూడూరు:** మతిస్థిమితం కోల్పోయి వివరాలు చెప్పలేని స్థితిలో ఉన్న ఓ బాలుడిని గుర్తించిన వ్యాపారి శుక్రవారం రాత్రి ఆ బాలుడిని పోలీసు స్టేషన్‌కు చేర్చాడని ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. బాలుడు గూడూరు ప్రధాన సెంటర్‌లో ద్విచక్రవాహనాలను ఆపుతున్నాడన్నారు. బాలుడు చూస్తే ఆరోగ్యంగా ఉన్నాడన్నారు. బాలుడి ఫొటో గుర్తించిన వారు పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

### ఆర్వోబీపై గడ్డర్ల ఏర్పాటు పూర్తి

**గార్ల:** గార్ల-డోర్నకల్ మధ్యలో రేల్వేగేట్‌పై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా రైల్వేట్రాక్ పై 3 రోజులుగా నిర్మిస్తున్న ఆర్వోబీపై గడ్డర్ల ఏర్పాటు పనులు శుక్రవారం పూర్తయ్యాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో రైల్వే లైన్ల మధ్యలో ఫిల్లర్లపై క్రేన్ల సహాయంతో గడ్డర్లను ఏర్పాటు చేశారు. పనులు పూర్తయినందున నేటి నుంచి రైల్వేగేటు యథావిధిగా తెరువనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

**నెల్లికుదురు:** సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టి తెలంగాణ ప్రజల ఆకాంక్షల పరిపూర్తికి ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివి జన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయన్న, నాయకుడు ఆరెళ్లి కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సొల్లతండా శివారు శనిగకుంట తండాలో గ్రూపు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

### చర్మవ్యాధులపై అవగాహన

**కురవి :** మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం వైద్యులు చర్మవ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ ఆఫీసర్ డాక్టర్ ఎల్లయ్య మాట్లాడుతూ చర్మ వ్యాధులపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

### పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

**మహబూబాబాద్ రూరల్ :** మండలంలోని సోమ్లు తండాకు చెందిన లాలు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా తన సెల్‌ఫోన్ గురువారం పోగొట్టుకున్నాడు. వెంటనే రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుగొని రూరల్ ఎస్సై వి.దీపిక శుక్రవారం లాలుకు అప్పగించారు.

### జిల్లా స్థాయికి విద్యార్థులు ఎంపిక

**చిన్నగూడూరు :** స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ చిన్నగూడూరు, జయ్యారం, కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ మండల స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీల్లో జిల్లా స్థాయికి అర్హత సాధించినట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రెహమాన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని చిన్న గూడూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో వివిధ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు.

### కుక్కలకు రేబిస్ టీకాలు

**డోర్నకల్ :** స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం పశుపక్షోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పశువైద్యశాలలో కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాల శిబిరం నిర్వహించారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్ నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

### 'భారత్ పర్వ్'లో డీపీఆర్‌ఓ

**మహబూబాబాద్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీ ఎర్రకోట ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారత్ పర్వ్ కార్యక్రమంలో డీపీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

### డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

**గూడూరు:** స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో శుక్రవారం డీటీఎఫ్ మండల శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కృష్ణమూర్తి, పరిశీలకుడిగా సంఘం రాష్ట్ర కౌన్సిలర్ హరిశంకర్ పాల్గొన్నారు. మండల అధ్యక్షుడిగా బోడ దూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా ఇస్లావత్ చందాతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### గాలిగోపుర పంచకలశ ప్రతిష్ఠ

**మరిపెడ రూరల్:** మండలంలోని గుండెపుడి సీతారామచంద్రస్వామి ఆలయ గాలిగోపుర పంచకలశ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కిషన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, కన్నంతరెడ్డి, యుగంధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అనిల్ రెడ్డి, నిశిధర్‌రెడ్డి జీర్ణోద్ధరణ చేశారు.

### ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

**కురవి:** మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ జిల్లా నాయకుడు వెడవల్లి హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో టీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

### వాసవీమాతా ఆత్మార్పణ దినోత్సవం

**మహబూబాబాద్ రూరల్ :** శ్రీవాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మానుకోటలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్యులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

### పరామర్శ

**గూడూరు:** మండలంలోని మచ్చర్ల శివారు రేగడి తండాలో ఇటీవల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బానోతు రవికుమార్ తండ్రి బిచ్చానాయక్ మృతి చెందగా శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ రవీందర్‌రావు రవికుమార్ కుటుంబాన్ని పరామర్శించారు.

## క్లుప్తంగా

### ఫ్యాన్ల బహూకరణ

**కురవి:** సీరోలు మండలం కొత్తూరు గ్రామ శివారు గుజిలి తండాలోని ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త సూరిశెట్టి అనిత-వాసు దంపతులు రూ.6వేల విలువైన ఫ్యాన్లను పంపించగా సీరోలు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు శుక్రవారం అందజేశారు.

### అంబులెన్స్ తనిఖీ

**కురవి :** మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా కోఆర్డినేటర్ బత్తిని మహేష్ తనిఖీ చేశారు. వాహనంలోని పలు రికార్డులను పరిశీలించారు. మందులను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, గడువు తీరిన మందులను వాడొద్దని సూచించారు. రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఈఎంటీ వెంకన్న, పైలట్ వీరన్న పాల్గొన్నారు.

### ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**కేసముద్రం :** అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేకుంటే భూపోరాటాలు తప్పవని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అజయ్‌సారథి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ధర్మన్న భవన్‌లో జరిగిన పార్టీ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి శేఖర్, సహాయ కార్యదర్శి భాస్కర్, పాండురంగాచారి, పాల్గొన్నారు.

### సన్మానం

**మహబూబాబాద్ :** హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఇటీవల పదవీ కాలం పూర్తయిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. మానుకోట మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డిని, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్నను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఫరీద్, మార్నేని రఘు తదితరులు పాల్గొన్నారు.

### అయోధ్యలో పారిశుద్ధ్య పనులు



సాక్షి ఎఫెక్ట్..

**మహబూబాబాద్ రూరల్ :** అయోధ్య గ్రామంలో 'అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం' శీర్షికన ఈ నెల 30న కథనం సాక్షిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో సంబంధిత అధికారులు స్పందించగా పంచాయతీ కార్యదర్శి మద్దిని శ్రీలత గ్రామంలో పారిశుద్ధ్య పనులు చే యించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్యలో ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజ లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

**మహబూబాబాద్:** ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని సానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని పలు షాపుల్లో మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తనఖీలు చేసి 200 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం కేన్సర్ లాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. తనిఖీల్లో హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

### అనాథలకు అన్నదానం

**గార్ల :** 1997- 98 సంవత్సరంలో గార్ల హైస్కూల్‌లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం గార్లకు చెందిన అన్నం శ్రీనివాసరావు అనాథ ఆశ్రమంలో 160 అనాథలకు అన్నదానం చేశారు. నాడు హెచ్‌ఎంగా పనిచేసిన తిరుమల్‌రావు జ్ఞాపకార్థం సుమారు రూ.8 వేలు విలువ చే వీల్‌చైర్‌ను పాఠశాలకు బహుకరించడమే కాకుండా,విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

### సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

**గార్ల:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 13 నెలలు దాటినా నేటికి నాయీబ్రాహ్మణుల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం విచారకరమని ఆ సంఘం జి ల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న ప్రభుత్వంపై మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు.

### చైతన్యంగా ఉండాలి

**మహబూబాబాద్ అర్బన్:** సమాజ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర చైతన్యంగా ఉంటూ మహనీయులు, పోరాట వీరుల స్ఫూర్తితో సాగాలని ప్రజాకవి కొమిరె వెంకన్న (సాకి) అన్నారు. జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా జనరల్ కౌన్సిల్ సభ నిర్వహించారు. ముందుగా పీడీఎస్‌యూ జెండాను జిల్లా నాయకులు దేవేందర్ ఎగురవేసి విద్యార్థి అమరవీరులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్.కె. మదార్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ అప్పారావు, నాయకులు గణేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ నిధుల దుర్వినియోగం

- రెండో రోజు సామాజిక తనిఖీ
- పలు అవకతవకలు వెలుగులోకి
- రూ.5,37,383 రికవరీకి ఆదేశాలు

**మరిపెడ/మరిపెడ రూరల్:** ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ హాల్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ఇన్ హౌజ్ వేదిక రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. డీఆర్డీఓ మధుసూదన్ రాజ్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 ఆర్థిక సంవత్సరానికి మండలంలో మొదటి రోజు 26, రెండో రోజు 18 మొత్తం 44 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో రోల్ కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, హాజరు లేకుండా వేతనాలు చెల్లింపులు జరిగాయి. మస్టర్ల హాజరు లెక్కింపుల్లో తప్పిదాలు, పలు పనుల్లో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో 44 జీపీలో రూ. 5,37,383 దారి తప్పినట్లు వెలుగులోకి వచ్చాయి. అత్యధికంగా నీలికుర్తిలో రూ.1,21,241, ఎడ్జెర్లలో రూ. 55,378 నిధులు దుర్వినియోగం జరిగినట్లు తేలింది. ఇట్టి రికవరి డబ్బులను ఉపాధి హామీ బాధ్యులైన ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు చెల్లించేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అవినీతి ఆరోపణలు వచ్చిన మండలంలోని నీలికుర్తి, ఎల్లంపేట గ్రామాల్లో మళ్లీ విచారణ చేపట్టనున్నట్లు డీఆర్డీఓ చెప్పారు. కార్యక్రమంలో డీవీసీ మన్‌మోహన్, అంబుడ్స్‌పర్సన్ ఆదామ్, ఎస్‌ఆర్‌పీ చెన్నకేశవులు, ఎస్‌ఆర్‌పీ కొమురయ్య, ఏపీసీ అంజిగౌడ్, ఎంపీడీఓ కనకదుర్గ, ఏపీఓ మంగమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ వేదికలో పాల్గొన్న అధికారులు

# విప్లవకారుల ఐక్యతే పీడిత ప్రజలకు విముక్తి


నినాదాలు చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

- న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఐలయ్య

**మహబూబాబాద్ రూరల్ :** విప్లవకారుల ఐక్యతే పీడిత ప్రజలకు విముక్తి మార్గమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. మండలంలోని కంబాలపల్లిలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీలోకి అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్ చంద్రన్నవర్గం) నుంచి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బాబన్నతో పాటుగా 23 కుటుంబాలు న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఐలయ్య సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. ఈ చేరికను స్వాగతిస్తూ గౌని ఐలయ్య మాట్లాడుతూ భారతదేశంలో పార్లమెంట్ ఫాసిజం అమలు చేస్తూ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను రూపొందించి అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఐలయ్య, దేవేందర్, శ్రీధర్, లింగన్న, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# యూపీ సీఎం రాజీనామా చేయాలి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చంద్రన్న

**నెహ్రూసెంటర్ :** ఉత్తరప్రదేశ్‌లో గంగానదిపై సాగుతున్న కుంభమేళా తొక్కిసలాటలో వంద మంది మృతికి పరోక్షంగా కారణమైన యూపీ సీఎం యోగీఆదిత్యనాథ్ రాజీనామా చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తి పారవశ్యంతో వస్తున్న భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై నిర్లక్ష్యం చూపుతూ రాజకీయ లబ్ధి కోసం తప్పుడు విధానాలను అవలంభిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, సత్యం, రాములు, యాకయ్య, యాకయ్య, రంగయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రన్న

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**తొర్రూరు :** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బానోతు నందీశ్వర్ తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కౌన్సిల్ పోస్టర్లను శుక్రవారం డివిజన్ కేంద్రంలో సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4, 5వ తేదీల్లో భద్రాచలంలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభలు జరగనున్నాయని అన్నారు. ఈ సభల్లో విద్యారంగ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సునీల్, రాధాకృష్ణ, నవీన్, కార్తీక్, రామ్‌చరణ్‌లు, తది తరులు పాల్గొన్నారు.

# నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు

**మరిపెడ:** నిరంతర విద్యుత్ అందించేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు ఎన్పీడీసీఎల్ మహబూబాబాద్ ఎస్ఈ నరేష్ తెలిపారు. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని బోడఅమృతండా శివారులో ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్లాన్ చేసుకుంటున్నట్లు చెప్పారు. మరిపెడ పట్టణ కేంద్రంలో 160కేవీఏ, నాలుగు 100కేవీఏలు మరిపెడ రూరల్‌లో ఇరవై ఆరు 25కేవీఏ లైటింగ్ డీటీ ఆర్‌ను సమ్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్య లేకుండా చేస్తామన్నారు. ఆయనతోపాటు ఏడీఏ అజయ్, ఏఈలు పావని, నవ్య తదితరులు పాల్గొన్నారు.

### సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

**పెద్దవంగర:** నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా విద్యుత్ సూ పరింటెండెంట్ అధికారి ఇంజనీర్ నరేశ్ అన్నా రు. శుక్రవారం అవుతాపురంలో చేపడుతున్న విద్యుత్ మరమ్మతులను తొర్రూరు డీఈ మ ధుసూదన్‌తో కలిసి పరిశీలించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో గద్దర్‌ది కీలకపాత్ర

తెలంగాణ రాష్ట్రసాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రజాగాయకుడు గద్దర్ కీలకపాత్ర పోషించారని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం గద్దర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూ లమాలలు వేసి నివాళులర్పించారు. గద్దర్ తన ఆట, పాటతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్


డోర్నకల్ : నివాళులర్పిస్తున్న నాయకులు


మహబూబాబాద్ : నివాళులర్పిస్తున్న నేతలు


గూడూరు : నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


మహబూబాబాద్ అర్బన్ : గద్దర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సత్యనారాయణ


నెల్లికుదురు : అంబేద్కర్ సెంటర్‌లో గద్దర్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు